క్లుప్తంగా

15 రోజుల్లో పనులు పూర్తి చేయండి

పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు



తెనాలిఅర్బన్: తెనాలి పూలే కాలనీలోని ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్ నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను 15 రోజులలో పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ దాసరి శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడ చేయాల్సిన పనులపై ఆరా తీశారు. అలాగే ట్రెయిల్ రన్ నిర్వహించారు. చిన్నచిన్న వర్క్‌లు పెండింగ్ ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 15 రోజుల్లో తాను మరలా వచ్చి పరిశీలిస్తానని, ఆ లోపు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయా లన్నారు. త్వరలో దీనిని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ డీఈ శివరామకృష్ణ, పలువురు పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగ అధికారులు ఉన్నారు.

వేస్ట్‌పికర్స్‌కు రిక్షాబండ్ల పంపిణీ



తెనాలి: దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ యడ్ల లింగయ్య కాలనీలో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్లకు రిక్షాబళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య చేతులమీదుగా వీటిని అందజేశారు. వేస్ట్ పికర్ల ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, భుజన మోసుకుంటూ సంపాదించే డబ్బుల కన్నా రిక్షాబండితో ఎక్కువ డబ్బులను సంపాదించుకోవచ్చని చెప్పారు. తల్లిదండ్రులు మంచి మార్గంలో నడుస్తూ, పిల్లలను చక్కగా చదివించాలని సూచించారు. బయట అధిక వడ్డీలకు డబ్బులు తీసుకోవద్దనీ, అలా తీసుకున్న పేదలు ఎన్నో బాధలుపడుతున్నారని హెచ్చరించారు. స్థానిక అంగన్‌వాడీ టీచర్, ప్రభుత్వ పాఠశాల టీచర్, రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు, రమేష్, రాజశేఖర్, హావిల పాల్గొన్నారు.

ప్రజ్ఞాచారికి గద్దర్ జాతీయ సాహితీ సేవాపురస్కారం



తెనాలి: రూరల్ పరిధిలోని కొలకలూరుకు చెందిన కవి డాక్టర్ డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి గద్దర్ జాతీయ సేవాపురస్కారం లభించింది. మమత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం సాయి తేజ జూనియర్ కళాశాల వేదికపై జరిగిన వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందజేశారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సాహితీ అకాడమీ చైర్మన్ జీ.వి.వెన్నెల గద్దర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్, మనసు ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రవర్తి తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు.

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు



తెనాలిఅర్బన్: చంద్రబాబునాయుడు కాలనీలోని రాజీవ్ గృహ కల్పలో నూతన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. రాజీవ్ గృహ కల్పలో డ్రెయినేజీ వ్యవస్థ పాడై అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రి మనోహర్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో గురువారం మంత్రి ఓఎస్‌డీ ఎస్.యేసురత్నం, కమిషనర్‌లు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రెయినేజీ వ్యవస్థ పునఃరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. నూతన డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పలువురు మున్సి పల్,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తెనాలిఅర్బన్: అంబియంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని అమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ షేక్ ఇర్షాద్ మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. డైరెక్టర్ షేక్ సల్మా, ప్రిన్సిపల్ లక్ష్మిప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూలు నిర్మాణానికి మేము సైతం

నందివెలుగులో శరవేగంగా జరుగుతున్న పనులు

● గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులు ● ప్రస్తుతం నిధులు రాకపోవడంతో దాతల సాయం ● సంక్రాంతి నాటికి ప్రారంభించాలని నిర్ణయం

ప్రపంచాన్ని మార్చాలంటే కావల్సిన శక్తివంతమైన ఆయుధం చదువే. ఇదే విషయాన్ని గత జగనన్న ప్రభుత్వం గుర్తించింది. సంపదకంటే చదువు గొప్పదని, ఎందుకంటే సంపదను మనం కాపాడుకోవాల్సి ఉంటుందనీ, చదువు మనల్ని కాపాడుతుందని గట్టిగా నమ్మారు నాటి వైఎస్సార్ సీపీ పాలకులు. అందుకే పాడుబడిపోయిన పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. అక్కడి తరగతి గదుల నుంచి పిల్లలు వాడుకునే పుస్తకాలు, ధరించే బూట్ల వరకు జగనన్న స్వయంగా పరిశీలించి మరీ అందించిన సందర్భాలున్నాయి. అలా అభివృద్ధికి నోచుకున్నదే నంది వెలుగులోని పాఠశాల. అయితే కూటమి పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు తాను వెన్నుదన్నుగా నిలబడ్డారు ఓ ఎన్ఆర్ఐ. ప్రస్తుతం ఆయన సహకారంతో పనులు చకచకా సాగుతున్నాయి.



తుదిదశ నిర్మాణ పనుల్లో నందివెలుగు జెడ్పీ హైస్కూలు

నందివెలుగు(తెనాలి): రూరల్ మండలం నందివెలుగులోని జిల్లా పరిషత్ హైస్కూలు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సంక్రాంతి నాటికి భవనాలను సిద్ధంచేసి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న తరగతులను ఇక్కడికి తరలించాలనే భావనతో పనుల వేగం పెంచారు. నాడు–నేడు రెండో దశ పథకం కింద చేపట్టిన పనుల కొనసాగింపుగా గ్రామానికి చెందిన 'మేము సైతం' సంస్థ పర్యవేక్షణలో హైస్కూలును సిద్ధం చేస్తున్నారు. నందివెలుగులోని జిల్లా పరిషత్ హైస్కూలును 1980 ప్రాంతంలో నిర్మించారు. రెండు బ్లాకుల్లో ఎనిమిది తరగతి గదులు ఉండేవి. కాలక్రమంలో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పునర్నిర్మాణ ఆవశ్యకత ఏర్పడింది. 2015లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకం కింద నాలుగు తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు మంజూరుచేశారు. 2018లో పనులు ప్రారంభించారు. రెండు గదులకు పునాదిని నిర్మించి, పిల్లర్లపై శ్లాబు మాత్రం వేశారు. గోడల నిర్మాణం వంటివేమీ చేపట్టలేదు. సంబంధిత కాంట్రాక్టరు ఆ పనులను పూర్తిచేయలేదు. గత ప్రభుత్వం నాడు–నేడు రెండో దశ పనుల కింద నందివెలుగు హైస్కూలు నిర్మాణానికి అనుమతిని మంజూరు చేసింది. మొత్తం 11 తరగతి గదులు, టేబుల్స్, పిల్లలు కూర్చునే బల్లలు, బోర్డులు, ఆర్‌ఓ ప్లాంట్, కిచెన్ షెడ్డు, టాయ్‌లెట్లు...వంటి పది కాంపోనెంట్స్‌కు రూ.63 లక్షలు మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. 2022 ఏప్రిల్‌లో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. మళ్లీ అదనపు తరగతి గదుల నిమిత్తం ఇదే పథకం కింద రూ.1.29 కోట్లు మంజూరు చేయగా, అ పనులకూ అదే ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. గతంలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తిచేసి, కొత్తపనులను ఆరంభించారు. మొత్తం రూ.1.92 కోట్లకు గాను రూ.1.20 కోట్ల వరకు పనులు పూర్తయ్యాయి. ఆరు తరగతి గదులను నిర్మాణం పూర్తయింది. పది కాంపోనెంట్స్‌ను పూర్తిచేయగలిగారు. తర్వాత ఎన్నికలు రావటం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు–నేడు పథకం పనులు నిలిచిపోయాయి.



ధూళిపాళ్ల సుధాకర్

ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సేవాసంస్థ 'మేము సైతం' గౌరవ అధ్యక్షుడు, ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్ రూ.35 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తంతో పాఠశాల పెయింటింగ్ పనులు, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు. జనవరి నెలలో పనులను పూర్తిచేసి పాఠశాల పునఃప్రారంభాన్ని ఘనంగా నిర్వహించాలనే సన్నాహాల్లో ఉన్నారు. ప్రస్తుతం హైస్కూలు తరగతి గదులను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు.

అంతేకాకుండా మరో ఎనిమిది గదులు, సైకిల్ స్టాండ్, డైనింగ్ హాలుతోపాటు మరో 1.5 ఎకరాల స్థలసేకరణ చేసి, క్రీడల కోసం కోర్టుల ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు మేము సైతం అధ్యక్షుడు కళ్యాణం సాంబశివరావు తెలియజేశారు. ఇందుకు దాతల సహాయాన్ని కోరుతున్నట్టు వివరించారు.

భూ వివాదాలు పరిష్కరించుకోవచ్చు

సబ్ కలెక్టర్ సంజనా సింహా



దంతలూరు లో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దారు సిద్ధార్థ



అర్జీదారుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ వివాదాలను పరిష్కరించుకోవచ్చని సబ్ కలెక్టర్ సంజనా సింహా పేర్కొన్నారు. మండలంలోని కొలకలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుకు 37 అర్జీలు వచ్చాయి. వీటిలో మ్యుటేషన్‌కోసం 28, ఆధార్‌సీడింగ్ కోసం మూడు, 22ఏ లిస్టులో ఉన్న భూముల కోసం ఒకటి, సర్వే కోసం ఐదు ఉన్నాయి. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మండల స్పెషలాఫీసర్ శ్రీధర్ బాబు, దేవదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే కొలకలూరులో కొమ్మమూరు మురుగు కాల్వ కట్ట వెంబడి రైతులు రాకపోకలు సాగించేందుకు ఉన్న రహదారి గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించాడని గ్రామస్తులు ఇటీవల సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ గురువారం సాయంత్రం రహదారిని పరిశీలించారు. అలానే గ్రామ శివారులో అన్నదమ్ముల వివాదం ఉన్న భూమిని పరిశీలించారు. తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

దంతలూరు(కొల్లిపర): గ్రామాలల్లో భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని, ఎవరైనా భూ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే తక్షణమే రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు తహసీల్దారు జి.జిద్దార్థ పిలుపునిచ్చారు. కొల్లిపర మండల పరిధిలో దంతలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు.అనంతరం సదస్సులో వచ్చిన 09 అర్జీలను పరిశీలించారు.కార్యక్రమంలో ఆర్ఐ వంశీ కృష్ణా, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన నేటి అవసరం

ఖాతాదారుల చైతన్య/అవగాహన వర్క్‌షాపులో వేణుగోపాల్



అవగాహన కరపత్రం ఆవిష్కరణ

తెనాలి: సమాజంలో ప్రతి వ్యక్తి సైబర్ నేరాలపై తగిన అవగాహన కలిగి ఉండాలని, ఎవరూ కూడా ఈ నేరాలతో మోస పోరాదనేది భారతీయ రిజర్వు బ్యాంకు ముఖ్య ఉద్దేశమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు తెనాలి శాఖ అసిస్టెంట్ మేనేజర్ వి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో గురువారం భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో 'ల్యాంప్' సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాదారుల చైతన్య/అవగాహన కోసం ఒకరోజు సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథి వేణుగోపాల్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో పరిసరాల్లోని ప్రజలకు ప్రభుత్వ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించాలని, సంపాదనలో ఇరవై శాతం తప్పకుండా పొదుపు చేయడం అలవరచుకోవాలని సూచించారు. అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ రిసోర్స్‌పర్సన్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి లక్షాధికారి కావాలని, ప్రభుత్వ బ్యాంకులో మాత్రమే ఖాతాదారుల డబ్బుకు భద్రత ఉంటుందని, ప్రైవేటు వడ్డీల జోలికి వెళ్లకూడదని సలహానిచ్చారు. మెప్మా పట్టణ మిషన్ మేనేజర్ విజయకుమారి మాట్లాడుతూ డిజిటల్ మోసాల గురించి తెలుసుకొని అందర్నీ చైతన్యపరుస్తూ, ఏ ఒక్కరూ మోసపోకుండా చూడాలని అన్నారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ మాట్లాడుతూ బ్యాంకు సేవలకోసం ఇతరులపై ఆధారపడకూడదని, సొంతంగా ఏటీఎంను వాడటం అలవాటుచేసుకోవాలని చెప్పారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలను వివరిస్తూ ప్రతివారూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఖాతా ద్వారా జరిపే లావాదేవీలు ఎప్పటికప్పుడు మొబైల్ కి వచ్చేవిధంగా చూసుకోవాలని, బ్యాంకు సేవలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మరో రిసోర్స్ పర్సన్ తురకా మంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు స్వాతి, శౌరయ్య, సన్నీ, వివిధ సంఘాల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు. తొలుత అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

కేంద్రియ విద్యాలయాల్లో చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం

విద్యాలయ సంఘటన్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఎం.రాజేశ్వరరావు



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

తెనాలి: కేంద్రియ విద్యాలయాల్లో చదువుతోపాటు క్రీడలకూ తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్టు విద్యాలయ సంఘటన్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఎం.రాజేశ్వరరావు వెల్లడించారు. స్థానిక కేంద్రియ విద్యాలయలో గురువారం సాయంత్రం వార్షిక క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేశ్వరరావు మాట్లాడుతూ తెనాలి కేంద్రియ విద్యాలయకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఈ విద్యాలయ విద్యార్థులు జాతీయ రాష్ట్రస్థాయిలో పతకాలను సాధిస్తూ, ఖ్యాతిని పొందుతుండటం అభినందనీ యం అన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా విద్యా లయం నడుస్తోందని చెప్పారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తాయని, కోవిడ అనంతరం ప్రతి మనిషి రోజుకు 10 వేల అడుగులు నడవటం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పరిశోధనలు వెల్లడించినట్టు తెలిపారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షేక్ షబీనా మాట్లాడుతూ క్రీడలతో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే ఏ క్రీడలోనైనా రాణించవచ్చని తెలిపారు.

అందుకు పాఠశాలస్థాయిలో ప్రోత్సాహం కావాల్సి ఉందన్నారు. కేంద్రియ విద్యాలయంలో క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పారా వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు పి.నాగరాజు మాట్లాడుతూ, వైకల్యం క్రీడలకు ఏమాత్రం అడ్డుకాదని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ అధికారి మదన్‌మోహనరావు మాట్లాడారు. క్రీడాదినోత్సవాన విద్యార్థులు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులను అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ రవి కుమార్, ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్, ఉపాధ్యాయులు రామిరెడ్డి, అజీమ్, దీప్తికమల్, సురేష్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణానికి స్థల పరిశీలన



తెనాలిఅర్బన్: బస్టాండ్ అవుట్‌గేట్ సమీపంలోని విశ్వకళశాల ఆవరణలో రక్షిత మంచినీటి పథక రిజర్వాయర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన విశ్వకళశాలను పరిశీలించి కళశాల యాజమాన్యంతో దానిపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళశాల స్థలం మున్సిపాలిటీదని, వారికి 2026 వరకు లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. దానిలో కొంత భాగాన్ని తీసుకునేందుకు యాజమాన్యంతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్‌వో రాంప్రసాద్, టీపీవో సాంబశివరావు ఉన్నారు.

రహదారుల వెంట ఆక్రమణలు తొలగించండి



తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి ఆదేశించారు. పట్టణంలోని 3,7,10 వార్డులలో గురువారం ఆయన పర్యటించారు. మురుగు కాల్వలు పొంగి రోడ్లపైకి రావడాన్ని గమనించిన ఆయన తాత్కాలికంగా కాల్వలను తీయించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నేడు పట్టభద్రులతో సమావేశం

తెనాలిరూరల్: తెనాలి వేమూరు నియోజకవర్గాల్లోని పట్టభద్రులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరి ప్రసాద్, జొన్నాదుల మహేష్, కంచర్ల ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ తెనాలి నాజరుపేటలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3.00 గంటలకు తెనాలి, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం జరుతుందన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్రం తోడ్పాటు

రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి



మాట్లాడుతున్న బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి

తెనాలి: మాజీ సైనికుల సేవలను దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం పలు సౌకర్యాలను కల్పిస్తోందని రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి చెప్పారు. సైనిక్ స్కూల్స్‌లో మాజీ సైనికుల పిల్లలకు ప్రవేశం గురించి వివరిస్తూ, సంబంధిత ధ్రువపత్రాల్లో పిల్లల పేర్లు, భార్య పేర్లలో ఏవైనా తప్పులు ఉన్నట్టయితే సరిచేసుకోవాలని సూచించారు. మాజీ సైనికులు చనిపోయినట్టయితే మట్టిఖర్చుల కింద ఇస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం పెంపుదల చేసిందన్నారు. ది తెనాలి మాజీ సైనికుల సంక్షేమ సంగం 37వ వార్షిక సమావేశం గురువారం స్థానిక ఎన్జీవో కల్యాణమండపంలో నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు ఎస్ఎం సుభాని అధ్యక్షత వహించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి గుణశీల మాట్లాడుతూ మాజీ సైనికుల వివరాలన్నీ ఒక వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. ఇంతకుముందు జేసీఓ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు దొరికేవి కావనీ, ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మాజీ సైనికుల ఆడపిల్లలకు పెళ్లికానుక కింద రూ.50 వేలను ఇస్తారని, అర్హులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశం కోసం జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చనీ సూచించారు. సంఘ అధ్యక్షుడు జి.బాబూరావు మాట్లాడుతూ సైనిక సంక్షేమానికి సంబంధించి పింఛను, మెడికల్ కార్డు...లేదా ఇతర సమస్యలపై సంఘ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సంఘ కార్యదర్శి వి.మురళీకృష్ణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి సీహెచ్ వీరబ్రహ్మం జమాఖర్చులను వివరించారు. జిల్లా మాజీ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ చారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి


ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై 2వ బ్యాచ్‌కు తొమ్మిది శాఖల అధికారులు, సర్పంచులు, సచివాలయాల సిబ్బందితో శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ అధికారి గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం. విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, ఉపాధి హామీ పనులు, వ్యవసాయం తదితర తొమ్మిది లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ సీ.హెచ్ భార్గవ, ఎంపీహెచ్‌ఓ వి.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, వివిధ శాఖల అధికారలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రావినూతల



పుస్తకం, క్యాలెండరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త రావినూతల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం సంస్మరణసభను ఘనంగా నిర్వహించారు. శ్రీరామమూర్తి కుటుంబసభ్యులు, కళాకారుల ఆధ్వర్యంలో అంగలకుదురులోని కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సర్వీసులో రిటైరైన శ్రీరామమూర్తి, ప్రవృత్తిరీత్యా కవిత్వం వెలువరించారని, తన రచనలతో సాహితీ ప్రపంచంలో గుర్తింపును పొందినట్టు గుర్తుచేసుకున్నారు. సినీదర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ శ్రీరామమూర్తి కవితలో మానవతను సోదాహరణంగా వివరించారు. అంబేడ్కర్ సీరియల్ తీసినపుడు ఆయనతో కలిసి చేసిన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ఇదే వేదికపై శ్రీరామమూర్తి చివరి రచన 'దత్త గానలహరి' పుస్తకాన్నీ, రావినూతల ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కళారంగ ప్రముఖులు బొల్లిముంత కృష్ణ, అయినాల మల్లేశ్వర రావు, వేమూరి విజయభాస్కర్, వెంకట్, గణేష్ యూత్ అధ్యక్షుడు వీరవల్లి మురళి, అంగలకుదురు పంచాయతి ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం తదితరులు శ్రీరామమూర్తి వ్యక్తిత్వం, గుణగణాలు, సాహితీసేవను వివరించారు. శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం గొప్పది

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న నరేంద్రకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు స్మారకార్థం ఏటా ప్రతిభావంతులైన పేద విద్యార్థికి ఉన్నత చదువుల కోసం ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తుండటం గొప్ప విషయమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పెద్దల ఆశయాలను కొనసాగించటమే వారికిచ్చే నిజమైన నివాళిగా అభిప్రాయపడ్డారు. ప్రతిభావంతులపై అత్యంత ఆపేక్షను ప్రదర్శించే డాక్టర్ హరిప్రసాదరావు పేరిట ఉన్నతవిద్యను అభ్యసించే పేదవిద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుండటం అభినందనీయమన్నారు. డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు శతజయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ఏటా ఇస్తున్న రూ.లక్ష ప్రోత్సాహక నగదు పంపిణీ సభను గురువారం సాయంత్రం డాక్టర్ గోగినేని ఉమ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేశారు. ఐఐటీ, ముంబయిలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న చిలకలూరిపేట మండలం గణపవరం గ్రామానికి చెందిన కాటా హర్షితకు పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ చేతులమీదుగా రూ.లక్ష నగదును అందజేశారు. ప్రతిభావంతులైన పేదల ఉన్నతవిద్యకు తోడ్పడితే ఆ కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని నరేంద్రకుమార్ అన్నారు. ఆ దిశగా కృషిచేస్తున్న హరిప్రసాదరావు కుటుంబసభ్యులను అభినందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ గత అయిదేళ్లుగా డాక్టర్ హరిప్రసాదరావు స్మారకంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.లక్ష ఆర్థికసహాయాన్ని అందిస్తున్నట్టు గుర్తుచేశారు. చదువులో బాగా రాణించేవారంటే ఆయనకు అపారమైన ఆపేక్షగా గుర్తుచేసుకున్నారు. అందుచేతనే తన కుమారుడు, హరిప్రసాదరావు మనుమడు సందీప్ ఆలోచన ప్రకారం ప్రోత్సాహక నగదును పంపిణీ చేస్తున్నట్టు వివరించారు.ఈసారి వ్యవసాయ కుటుంబానికి చెందిన హర్షితను ఎంపికచేసినట్టు చెప్పారు. డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాదరావు, హర్షిత తల్లిదండ్రులు హరిబాబు, విజయలక్ష్మితోపాటు పట్టణ ప్రముఖులు డాక్టర్ ఎం.కస్తూరిబాబు, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, గోగినేని బుల్లిప్రసాద్, ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, గుమ్మడి రమేష్, ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



పనులుపరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న మురుగుసమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 34వ వార్డులో గురువారం పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉండటాని గమనించి ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రణాళికబద్ధంగా గ్యాంగ్ వర్క్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 34వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్‌కుమార్, టీపీవో సాంబశివరావు, పాల్గొన్నారు.